క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌ సీపీ కార్యకర్తల సమావేశం

కనిగిరిరూరల్‌: వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం ఈ నెల 15న స్థానిక పార్టీ కార్యాలయంలో కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ ఆధ్వర్యంలో జరుగుతుందని పార్టీ కార్యాలయ ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్‌ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ×కోటి సంతకాల సేకరణ× పై నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి పార్టీ ఒంగోలు పార్లమెంటరీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కసుకుర్తి ఆదెన్నలు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, మున్సిపల్‌ చైర్మన్‌లు, వైస్‌ చైర్మన్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్‌ఎంపీపీలు, పార్టీ మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్‌ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ రాష్ట్ర, జిల్లా నియోజవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, పార్టీ వివిధ విభాగాల అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ హాజరు కావాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కనిగిరిరూరల్‌: పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్‌ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ ఎస్‌కే నాయబ్‌ రసూల్‌ అన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్‌ నాయబ్‌ రసూల్‌మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కందుకూరు రోడ్డు, ఆర్టీసీ డిపో ప్రాంతాల్లో కాలువలను పరిశుభ్రం చేయించారు. ఇంట్లో నుంచి వచ్చే చెత్త, చెదారాన్ని కాలువల్లో వేయకుండా మున్సిపల్‌ చెత్త రిక్షా లేదా, చెత్త కుండీల్లో వేయాలని తెలిపారు. కాలువల్లో మురికినీరు నిలిస్తే.. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ సిబ్బంది, సచివాలయ శానిటరీ సెక్రటరీలు ఉన్నారు.

16న అవగాహన సదస్సు

పామూరు: మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లోని ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్‌ మైనారిటీలకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈ నెల 16న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ ఎస్సీసెల్‌, ఎస్టీసెల్‌ నాయకులతో పాటు రాష్ట్ర మహిళా విభాగం జోనల్‌ అధ్యక్షురాలు గంగసాని లక్ష్మి, రాష్ట్ర గ్రీవెన్స్‌సెల్‌ గట్లా విజయభాస్కర్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్‌ మైనారిటీ సెల్‌ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా బీఈడీ 3వ సెమిస్టర్‌ పరీక్షలు

పామూరు: స్థానిక ఈటీఎస్‌ అండ్‌ ఎల్‌ డిగ్రీ కళాశాలలో బీఈడీ 3వ సెమిస్టర్‌ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం ఇంగ్లిష్‌ పరీక్షకు మొత్తం 145 మందికి గాను 137 మంది హాజరుకాగా 8 మంది గైర్హాజరైనట్లు అబ్జర్వర్‌ కాశిరెడ్డి, ప్రిన్సిపాల్‌ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పంపిణీ చేస్తున్న ఏడీఏ జైనులాబ్దిన్‌

కనిగిరిరూరల్‌: రైతులు సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త, డాక్టర్‌ టి.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని ఎడవల్లిలో రైతులకు సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాల పథకం కింద 50 ఎకరాల్లో టీబీజీ 104 మినుము రకం విత్తనాలను రైతులకు ఉచితంగా కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ జి.రమేష్‌, ఏడీఏ ఎస్‌కే జైనులాబ్దిన్‌, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

19న సీనియర్‌ బాస్కెట్‌ బాల్‌ జట్టు ఎంపిక

కందుకూరు రూరల్‌: ఉమ్మడి ప్రకాశం జిల్లా సీనియర్‌ స్త్రీలు, పురుషుల బాస్కెట్‌ బాల్‌ జట్ల ఎంపిక ఈ నెల 19వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక టీఆర్‌ఆర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ వలేటి రవీంద్ర, సెక్రటరీ తొట్టెంపూడి సుబ్బారావు తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే స్త్రీలు, పురుషులకు వయసు పరిమితి లేదన్నారు. ఎంపికలకు వచ్చే వారు ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. ఎంపికైన జట్లు విశాఖపట్నంలో జరిగే 11వ సీనియర్‌ ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. నవంబర్‌ 7 నుంచి 10వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఎంపికలకు హాజరుకావాలని కోరారు.



ఓవీ రోడ్డుపై ఎటువంటి హెచ్చరిక గుర్తులు లేని దృశ్యం



శ్రీరాంనగర్‌ ప్రాథమిక పాఠశాల వద్ద స్పీడ్‌ బ్రేకర్‌ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం

రోడ్డు నిర్మించారు.. భద్రత మరిచారు



గురుకుల పాఠశాల వద్ద స్పీడ్‌ బ్రేకర్‌ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం



పాతరోడ్డు తొలగించకుండానే కొత్తరోడ్డు వేస్తున్న దృశ్యం

- సుమారు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఓవీ రోడ్డు నిర్మాణం
- హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవటంతో తరుచూ ప్రమాదాలు
- అధ్వానంగా రోడ్డు మార్జిన్లు
- రోడ్డు నిర్మాణంలో నిబంధనలు పాటించలేదన్న ఆరోపణలు

సింగరాయకొండ:

మండల కేంద్రంలోని కందుకూరు ఫ్లెటైవర్‌ నుంచి ఊళ్లపాలెం కటింగ్‌ వరకు సుమారు 1.85 కిలోమీటర్ల రోడ్డును సుమారు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో నిర్మించారు. రోడ్డు నిర్మించి సుమారు రెండున్నర నెల అవుతున్నా పూర్తిస్థాయిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఇక రోడ్డు మార్జిన్లు, గుర్తులు గానీ, స్పీడ్‌ బ్రేకర్లు గానీ ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు మార్జిన్లు అధ్వానంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికే మార్జిన్లు దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డుపై వేగంగా వెళ్లే వాహనాల ఈ కారణంగా తరుచూ ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి.

హెచ్చరిక బోర్డులు ఎక్కడ..?

నూతనంగా నిర్మించిన రహదారి పరిధిలో బీఆర్‌ అంబేద్కర్‌ గురుకుల పాఠశాల, జూనియర్‌ సెషన్‌ కోర్టు, ఇండస్ట్రియల్‌ ఏరియా, శ్రీరాంనగర్‌ ప్రాథమిక పాఠశాల, బాలయోగినగర్‌ జంక్షన్‌ ఉన్నాయి. ఈ మార్గంలో తారురోడ్డు కావటం, అది కూడా కొత్తది కావటంతో వాహనదారులు పరిమితికి మించి వేగంగా వెళుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆగస్టు 7వ తేదీ కొండపి మండలం కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన గుంజిక రత్తమ్మ మోటారుసైకిల్‌పై వస్తుండగా ప్రమాదవశాత్తు కారును ఢీకొని తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఇలాంటి ఘటనలు ఈ రోడ్డుపై నిత్యకృతమై పదుల సంఖ్యలో క్షతగాత్రులు ఉన్నారు. కానీ కాంట్రాక్టర్‌ మాత్రం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయరు. రోడ్డు భద్రతా గుర్తులు గానీ, స్పీడ్‌ బ్రేకర్లు గానీ ఏర్పాటు చేయరు.

స్పీడ్‌ బ్రేకర్లు తప్పనిసరి..

ఈ రహదారిపై కందుకూరు ఫ్లెటైవర్‌ వద్ద, బీఆర్‌ అంబేద్కర్‌ గురుకుల పాఠశాల వద్ద, బాలయోగినగర్‌ జంక్షన్‌ వద్ద, జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టు వద్ద, శ్రీరాం నగర్‌ మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాల వద్ద, ఊళ్లపాలెం కటింగ్‌ వద్ద స్పీడ్‌ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. కానీ కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యం కారణంగా మరెన్ని ప్రమాదాలు జరుగుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అధ్వానంగా రోడ్డు మార్జిన్లు..

ఈ రోడ్డు మార్జిన్లు కూడా అధ్వానంగా ఉన్నాయి. రోడ్డు మార్జిన్లో మట్టి పోసి డోజర్‌తో చదును చేశారే తప్ప రోలింగ్‌ చేయలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. దీంతో చిన్నపాటి వర్షానికి కూడా వాహనాలు రోడ్డు మార్జిన్లోకి వెళ్తే మార్జిన్లు ధ్వంసం అవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

నిబంధనలకు నీళ్లు..

రోడ్డు నిర్మాణంలో నిబంధనలు పాటించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాతరోడ్డు గుంతలమయంగా ఉంటే దానిని పూర్తిగా తొలగించి తరువాత చదునుచేసి కొత్త రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ కాంట్రాక్టర్‌ పాత రోడ్డు పూర్తిగా తొలగించకుండానే దానిపై కొత్త రోడ్డు నిర్మించాడని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పాతరోడ్డును ధ్వంసం చేసినప్పుడు వచ్చిన మెటీరియల్‌ను రోడ్డు మార్జిన్లో ఉపయోగించారని వాహనదారులు విమర్శిస్తున్నారు. నిబంధనల ప్రకారం తారు లేయర్‌ వేయాల్సిన మందం కన్నా తక్కువగా వేశారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ మార్గంలో తరుచూ పాతసింగరాయకొండ, ఊళ్లపాలెం, సోమరాజుపల్లి ప్రాంతాల నుంచి లారీలు, సుమారు 50 టన్నుల బరువు ఉన్న భారీ టిప్పర్లు తిరుగుతుంటాయి. దీంతో ఈ రోడ్డు దెబ్బతినే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండు నెలల క్రితం ఊళ్లపాలెం ఆర్చి వద్ద, సాయిబాబా గుడి సమీపంలో ఆర్‌అండ్‌బీ అధికారుల ఆధ్వర్యంలో చేసిన రోడ్డు మరమ్మతులు పూర్తిగా దెబ్బతిన్నాయని గతంలో ఈ ప్రాంతంలో చిన్నపాటి గుంత ఉంటే మరమ్మతుల పేరుతో గుంతకు చుట్టుపక్కల ఉన్న రోడ్డును ధ్వంసం చేశారంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన ప్రాంతాల్లో స్పీడ్‌బ్రేకర్లు వేయాలని, రోడ్డు మార్జిన్లు బాగు చేయాలని, క్వాలిటీ కంట్రోల్‌ అధికారులు పూర్తిస్థాయి విచారణ చేసి నాణ్యతా ప్రమాణాల ప్రకారం రోడ్డు నిర్మాణం జరిగిందా లేదా అని పరిశీలించి రోడ్డు నాణ్యతా నిబంధనలు పాటించాలని కోరుతున్నారు.

నకిలీ మద్యానికి వ్యతిరేకంగా నేడు భారీ నిరసన ర్యాలీ

సింగరాయకొండ: రాష్ట్రంలో నకిలీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 15న సింగరాయకొండలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కుటీర పరిశ్రమ లాగా నారా వారి నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్న కూటమి ప్రభుత్వ పనితీరుకు వ్యతిరేకంగా నియోజకవర్గ స్థాయిలో జరిగే కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ పాల్గొంటారన్నారు. పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్‌ సర్కిల్‌ కార్యాలయం నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కొండపి: నకిలీ మద్యానికి నిరసనగా సింగరాయకొండలో బుధవారం జరిగే ర్యాలీలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని పార్టీ మండల కన్వీనర్‌ బచ్చల కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌ పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

327 పొగాకు బేళ్ల తిరస్కరణ

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన వేలంలో 327 పొగాకు బేళ్లను వ్యాపారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. కె. ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు 1067 బేళ్లను వేలానికి తీసుకురాగా 740 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.316, కనిష్ట ధర రూ.70, సరాసరి ధర రూ.240.65 పలికింది. వేలంలో 42 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో 251 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్‌ తెలిపారు. కస్టర్‌ పరిధిలోని దాదానాయుడుపాలెం, చవటపాలెం, రామాయపాలెం, దాసిరెడ్డిపాలెం, కొండపి, పోలిరెడ్డిపాలెం గ్రామాల రైతులు 1291 బేళ్లను తీసుకురాగా 1040 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.315, కనిష్ట ధర రూ.70, సరాసరి ధర రూ.238.51గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలు పాల్గొన్నాయి.



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

బోర్డు అనుమతి మేరకే సాగు చేయాలి

కొండపి: బోర్డు అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలని కొండపి బోర్డు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్‌ అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో రైతులతో పొగాకు ఉత్పత్తి నియంత్రణ ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు బ్యారెన్లు, భూములు కౌలుకు తీసుకోవద్దని సూచించారు. పొగాకు నర్సరీలకు రిజిస్ట్రేషన్‌ తప్పనిసరని, అనధికారిక నర్సరీలను సాగు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రమంగా పొగాకు సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు, ఆర్థికంగా లాభదాయకమైన పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. ఐటీసీ వ్యాపార ప్రతినిధి దినేష్‌, జీపీఐ లిమిటెడ్‌ ప్రతినిధి అనిల్‌కుమార్‌, బోర్డు అధికారులు, రైతులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు



మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్‌

మూల్యాంకనం వెంటనే పూర్తి చేయాలి

సీఎస్‌పురం(పామూరు): ఫార్మాటివ్‌ అసెస్‌మెంట్‌ 2 పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించి, మూల్యాంకనం వెంటనే పూర్తి చేయాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని డీజీపేట జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో పరీక్షల నిర్వహణ తీరును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పరీక్షలు పూర్తయిన వెంటనే జవాబు పత్రాలు దిద్ది మార్కులను ఆన్‌లైన్‌లో నమోదుచేయాలన్నారు. సిలబస్‌ సకాలంలో పూర్తి చేయడం, విద్యా అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. గెజిటెడ్‌ హెచ్‌ఎం షేక్‌.రసూల్‌, సీఆర్‌పీ వల్లంశెట్టి సతాష్‌కుమార్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డీజీపేట ప్రాథమిక పాఠశాలను తనిఖీచేస్తున్న ఎంఈఓ

భూసార పరీక్షలు తప్పనిసరి

టంగుటూరు: రైతులంతా విధిగా భూసార పరీక్షలు చేయించుకొని వాటికి అనుగుణంగా ఎరువులు, పురుగుమందులు వాడాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజ అన్నారు. మండలంలోని వల్లూరు, కాకుటూరివారిపాలెం, ఎం. నిడమానూరు గ్రామాల్లో భూసార పరీక్షల ఫలితాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి యుగంధర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ఒంగోలు జిల్లా వనరుల కేంద్రం నుంచి వ్యవసాయ అధికారి శైలజ పాల్గొని భూసార పరీక్షా ఫలితాల ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. మట్టి నమూనా పరీక్షలు ఆధారంగా ఎరువుల వాడకం ద్వారా పెట్టుబడి తగ్గించవచ్చన్నారు. నీటి పరీక్షలు చేయించుకోవడం వల్ల కలిగే లాభాలను కూడా వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారులు రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, గ్రామ సహాయకులు ప్రభాకర్‌, అజయ్‌, మెహరున్నీసా, భరత్‌ పాల్గొన్నారు.



వల్లూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

నేర్చుకోవాలనే ఆసక్తి కలిగేలా బోధించాలి

కొండపి: విద్యార్థులు నేర్చుకోవాలని ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.కిరణ్‌కుమార్‌ అన్నారు. మండలంలోని కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో విద్య ప్రగతి పరీక్ష సిద్ధత, హాజరుశాతం గురించి అడిగి తెలుసుకున్నారు అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. గత సంవత్సరం లాగా ఈ ఏడాది కూడా పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటాలని, ఆ విధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర ప్రసాద్‌, సింగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

సంక్షేమ హాస్టల్లో నీటి సౌకర్యం కల్పించాలి

కొండపి: సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహానికి నీటి వసతి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్‌తో కలిసి ఆయన మంగళవారం సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హాస్టల్‌లో ఎదురవుతున్న సమస్యల గురించి వివరించారు. హైస్కూల్‌ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఈ వసతి గృహంలో ఈ సంవత్సరం ఒక్కరూ కూడా చేరలేదన్నారు. హాస్టల్లో కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లకు నీటి వసతి లేకపోవడంతో వినియోగంలో లేకుండా పోయాయని విద్యార్థులు తెలిపారు. బోరు నుంచి నీరు సక్రమంగా రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వసతి గృహం ఆవరణలో పాములు, తేళ్లు తిరుగుతున్నాయని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వసతి గృహాల్లో మౌలిక వసతులు లేకపోవడం, తగినంత మంది వార్డెన్లు లేకపోవడం మూడు నాలుగు హాస్టళ్లకు ఒక్కరే వార్డెన్‌గా వ్యవహరించడం, విద్యార్థుల భద్రతకు, ఆరోగ్య, విద్య పరిరక్షణకు తగిన సమయం కేటాయించే కేర్‌ టేకర్‌ లేకపోవడం మొదలైన సమస్యల తోటి హాస్టల్లో పిల్లలు చేరటం తగ్గుతుందన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

బాలికలు ఉన్నత లక్ష్యంతో చదవాలి



మాలపాడులో విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీఓ హేమలత


పొన్నలూరు: బాలికలు ప్రాథమిక దశ నుంచే ఉన్నత లక్ష్యంతో చదవాలని జిల్లా బాల బాలిక అభివృద్ధి అధికారిని హేమలత అన్నారు. మండలంలోని మాలపాడు కేజీబీవీ విద్యాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించి పాఠశాల వసతులను పరిశీలించడంతో పాటు విద్యార్థినులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల బాలికలకు కేజీబీవీ విద్యాలయాలు వరమని, ప్రతి విద్యార్థిని క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. ఇప్పటి నుంచే పది, ఇంటర్‌ విద్యార్థినులు చక్కని ప్రణాళికతో చదివి ఉన్నత మార్కులు సాధించాలన్నారు. అధ్యాపకులు కూడా సమయపాలన పాటించి విద్యార్థునులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్‌ సుభాషిణితో కలిసి భోజనాన్ని పరిశీలించారు.

దివ్యాంగులకు మళ్లీ వెరిఫికేషన్‌ కష్టాలు

సింగరాయకొండ: మండలంలోని దివ్యాంగులకు మళ్లీ వెరిఫికేషన్‌ కష్టాలు మొదలయ్యాయి. దివ్యాంగుల వికలాంగత్వ శాతం నిర్ధారణ కోసం తొలుత కొండపి, ఒంగోలులో నిర్వహించారు. ఆ సమయంలో వైద్యులు ఇష్టం వచ్చినట్లు 30, 40 శాతం నమోదు చేశారు. దీంతో దివ్యాంగులు తమకు జరిగిన అన్యాయానికి కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో దిగివచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ దివ్యాంగులకు సర్టిఫికెట్‌ వెరిఫికేషన్‌ కార్యక్రమం చేపట్టారు. ఈసారి దివ్యాంగులకు వారికి ఉన్న వైకల్యాన్ని బట్టి మూడు విడతలుగా తనిఖీలు చేసేందుకు నిర్ణయించారు. మొదటి విడతలో భాగంగా కళ్లు, చెవి వికలాంగత్వం ఉన్న వారికి మార్కాపురంలో తనిఖీ చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రకారం మండలంలో మొదటి విడతలో ఆరుగురు ఉన్నారని, వీరు ఈ నెలలో వారికి నిర్ణయించిన తేదీల్లో సర్టిఫికెట్లు తనిఖీ చేయించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే మార్కాపురం వెళ్లి తనిఖీలు ఎలా చేసుకోవాలో అర్థం కావడం లేదని, కేవలం చార్జీలకే వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన దుస్థితి ఉందని దివ్యాంగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగులపై దయతలచి మండలానికి దగ్గరగా ఉన్న ఆస్పత్రుల్లో తనిఖీలు చేయించుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

టంగుటూరు: కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలకోటయ్య అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20 వేలు కౌలు రైతులకు ఇవ్వాలని, కౌలు చట్టాన్ని మార్చి వాస్తవ కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ మంగళవారం డీటీ శ్రీనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నూతన కౌలు చట్టాన్ని తీసుకువస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి ఇంత వరకు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కన్వీనర్‌ షేక్‌ మీరాస్‌, వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి వి.మోజెస్‌, వెంకరెడ్డి, జి.సాల్మన్‌, ఎం యానాది, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘ నేతలు

‘నాకు న్యాయం చేయండి’

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి సహకార సొసైటీలో ఇచ్చిన రుణం కన్నా అధికంగా నగదు వసూలు చేశారని ఆరోపిస్తూ మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన దివి శ్రీనివాసులు చింతలపాలెం గ్రామ పంచాయతీలో జరిగిన మీకోసం కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మౌనికకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తాను రుణం తీసుకున్న దాని కన్నా అధికంగా నగదు వసూలు చేశారని, రుణం చెల్లించటానికి పొలం కూడా అమ్ముకున్నానని, విచారించి అధికంగా వసూలు చేసిన మొత్తాలను తిరిగి ఇప్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అర్జీని సంబంధిత అధికారులకు పంపి తగిన న్యాయం చేస్తానని ఈఓ మౌనిక తెలిపారు.

భోజన నాణ్యతపై చైర్మన్‌ అసంతృప్తి



అన్నా క్యాంటీన్‌ను తనిఖీ చేసిన చైర్మన్‌ గఫార్‌

కనిగిరిరూరల్‌: అన్నా క్యాంటీన్‌లో పేదలకు పెట్టే ఆహారం అధ్వాన్నంగా ఉందని మున్సిపల్‌ చైర్మన్‌ ఎస్‌కే అబ్దుల్‌ గఫార్‌ అన్నారు. మంగళవారం చైర్మన్‌ గఫార్‌ అన్నా క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్‌ గఫార్‌ మాట్లాడుతూ అన్నా క్యాంటీన్‌లోని టిఫిన్‌లో సాంబార్‌ బాగా లేదని, మధ్యాహ్నం భోజనం గట్టిగా ఉందని, సాంబర్‌ పలుచగా ఉందని ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాను అన్నా క్యాంటీన్‌లో ఆహారంను రుచి చూసినట్లు తెలిపారు. క్యాంటీన్‌లో ఎంత మందికి టోకెన్లు ఇస్తున్నారు. భోజనం నాణ్యత తీరును పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పేదలకు అందించే భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించక పోతే చర్యలు తప్పవని, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

కొండపి: కొండపిలో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.